# నిందితుణ్ని పట్టిచ్చిన 30ఏళ్ల నాటి వేలిముద్రలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: 30 ఏళ్ల క్రితం సేకరించిన వేలిముద్రలు మూడేళ్ల క్రితం జరిగిన ఓ చోరీ కేసులో నిందితుణ్ని పోలీసులకు పట్టిచ్చాయి. ఆటో డ్రైవర్ అబీద్ హుస్సేన్(62) మోతీలాల్ నెహ్రూ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడు 1987లో దొంగతనాలు, జూదాలు ఆడుతూ పోలీసులకు చిక్కాడు. అప్పట్లో పోలీసులు అతడి వేలిముద్రలు సేకరించి భద్రపర్చారు. ఆదే వ్యక్తి మూడేళ్ల క్రితం ఎర్రమంజిల్‌లో ఖాజామొయినుద్దీన్ ఇంట్లో చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో అప్పట్లో కేసు నమోదు చేశారు. కానీ అప్పటికున్న సాంకేతికతతో నిందితుణ్ని పట్టుకోలేకపోయారు. ఇటీవల కొత్తగా వచ్చిన రష్యన్ సాంకేతికతతో మళ్లీ ఓ సారి వేలిముద్రలను పరీక్షించారు. అబీద్ హుస్సేన్ 1987లో ఇచ్చిన వేలిముద్రలు, మూడేళ్ల కిందట చోరీ జరిగిన ప్రదేశంలో దొరికిన ముద్రలతో సరిపోలడంతో నిందితుడు అతడే అని గుర్తించారు. పోలీసులు శనివారం అబీద్‌ను అరెస్టు చేసి, రూ.3లక్షల విలువైన చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు.